క్లుప్తంగా

అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

ముప్పాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించనున్న అన్నదాత సుఖీభవ సాయం పొందేందుకు రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రంలో ధ్రువపత్రాలతో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ గురువారం తెలిపారు. ప్రస్తుతం ఫీల్డ్ స్థాయిలో అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల భూముల వివరాల వాలిడేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఫార్మర్ ఐడీ ఉన్న రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా నగదు బదిలీకి చర్యలు ఉంటాయని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించిన వివరాలను ఏపీఎఫ్ఆర్ ఫార్మర్ ఐడీలతో సరిపోల్చి ఫార్మర్ ఐడీ ఉన్న పట్టాదారు రైతులకు మాత్రమే నగదు విడుదల చేసే విధంగా ప్రణాళిక రూపొందించబడిందని అన్నారు. అర్హత కలిగి ఉన్నప్పటికీ ఏపీఎఫ్ఆర్ ఫార్మర్ ఐడీ లేకపోతే అనర్హతకు గురవుతారన్నారు. తక్షణమే ప్రతి రైతు ఫార్మర్ ఐడీ తీసుకోవాలని అన్నారు.

20 లోపు 'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

రాజుపాలెం: ఈ నెల 20వ తేదీ లోపు అన్నదాత సుఖీభవ పథకానికి పొలం కలిగిన ప్రతి రైతు పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రంలో అందజేయాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య గురువారం తెలిపారు. రైతు సేవా కేంద్రంలో రైతులు సంప్రదించినట్లయితే అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జూన్‌లో ప్రభుత్వం రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పెరికె ఫౌండేషన్ చైర్మన్ పెరికె వరప్రసాదరావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉచిత జ్యూట్ బ్యాగ్స్ శిక్షణ పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జ్యూట్ బ్యాగ్స్ తయారీకి సంబంధించి ఆయన పలు సూచనలు చేసి మాట్లాడారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్న ఉద్దేశంతో పెరికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా జ్యూట్ బ్యాగ్స్ తయారీ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వబడుతుందన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయసుగల మహిళలు అర్హులన్నారు. ఉచితంగా నేర్పబడుతుందన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం వల్ల 21 రకాల క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయన్నారు. తక్షణమే పాలిథిన్, ప్లాస్టిక్ బ్యాన్ చేయాలని, పేపర్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్ వాడి పర్యావరణానికి మేలు చేయాలని కోరారు. సత్తెనపల్లిలో జ్యూట్ బ్యాగ్స్ శిక్షణ ఇవ్వడానికి టీచర్ కావాలని, ఔత్సాహికులు 94404 56410 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మహిళలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్ళపాడు సమీపంలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేటకు చెందిన ఈర్లకొండ, భార్య కోటేశ్వరి సత్తెనపల్లి మండలంలోని భృగుబండ గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. గోళ్ళపాడు సమీపంలోని ఆక్రాన్ ఫార్మా కంపెనీ దాటాక ఈదురుగాలులకు రోడ్డుపై అడ్డుగా పడ్డ చెట్టును దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండ కుడి మోకాలుకు తీవ్ర గాయం కాగా, కోటేశ్వరి రోడ్డుపై పడటంతో తలకు, ముఖం పైన గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడికి ఎటువంటి గాయాలు కాకపోవటంతో సత్తెనపల్లి వైపు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

బాలుర గురుకుల పాఠశాల హెచ్‌ఎంకు సత్కారం



సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు ఒట్టిప్రోలు జాన్సన్‌ను సత్తెనపల్లి మేధావుల ఫోరం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాల 89 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు, అలాగే పాఠశాల విద్యార్థి సాయిశ్రీ చరణ్ 587 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు హెచ్ఎం జాన్సన్‌ని సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మేధావుల ఫోరం సభ్యులు చిలుకా అగష్టస్, పెద్దింటి నాగేశ్వరరావు, సాల్మన్, దేగల రాంబాబు, పెద్దింటి సాంబశివరావు, దీపాల పరంధామయ్య, డయాన్ ఉన్నారు.

ఈ వంతెనలు.. నరకానికి మార్గాలు



శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా ఉన్న నందిరాజుపాలెం రోడ్డులో వంతెన



ప్రమాదకరంగా చంద్రాజుపాలెం-మఠం రోడ్డులో గల వంతెన

- మండలంలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు, కల్వర్టులు
- ఆందోళనకు గురవుతున్న స్థానికులు

బెల్లంకొండ: కాలువలు, రహదారులపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి. కుంగిపోవడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులు నరకానికి మార్గాలుగా ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానిక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో నిర్మించిన వంతెనలు రక్షణ లేక, శిథిలావస్థకు చేరి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామం నుంచి బ్రహ్మంగారి మఠం వైపుగా వెళ్లే రోడ్డులో ప్రవహిస్తున్న కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదభరితంగా తయారైంది. ఇటీవల ఈ రహదారిలో నూతన తారు రోడ్డు నిర్మాణం చేసినప్పటికీ వంతెనకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. అదే విధంగా నాగిరెడ్డిపాలెం గ్రామం నుంచి నందిరాజుపాలెంకు మధ్యలో గల రహదారిపై నిర్మించిన వంతెన కూడా ధ్వంసం అయి, కుంగిపోవుటకు సిద్ధంగా వుంది.

నాలుగు గ్రామాలు.. తొమ్మిది వంతెనలు

మండలంలోని నందిరాజపాలెం, మాచాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాల మీదుగా చింతపల్లి మేజరు కాలువ ప్రవహిస్తుంది. దీనితో పలు గ్రామాలలో కాలువపై రోడ్డు మార్గాల కొరకు అక్కడక్కడా వంతెనలను నిర్మించారు. దాదాపుగా తొమ్మిది వంతెనల వరకూ నాలుగు గ్రామాలలో నిర్మించారు. ఈ వంతెనల్లో ఏడు ఆర్ అండ్ బీ పరిధిలోనివి కాగా, రెండు వంతెనలు ఎన్ఎస్‌పీ(నాగార్జునసాగర్ ప్రాజెక్ట్) పరిధిలోనివి. ఈ వంతెనలు అన్నీ పురాతనమైనవి కావడంతో శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వీటిలో చంద్రాజుపాలెం కాలువపై నిర్మించిన వంతెన పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా శిథిలమై కూలి పోయాయి. దీనితో వంతెనపై ప్రయాణించే వారు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. మేజరు కాలువలో నీళ్ల ప్రవహించే సమయంలోనూ ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనపై పలు ప్రైవేటు పాఠశాలల స్కూలు బస్సులు వెళుతుంటాయని గ్రామస్తులు చెబుతున్నారు. వంతెనలో నాణ్యత లోపించటంతో ఏమవుతుందోనని విద్యార్థుల, వారి తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రక్షణ గోడలు లేని నాగిరెడ్డిపాలెం-చౌటపాపాయపాలెం రోడ్డులో వంతెన



ప్రమాదభరితంగా ఉన్న బెల్లంకొండ క్రాస్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి వంతెన

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



కరపత్రాలను చూపుతున్న పారిశుధ్య కార్మికులు

అమరావతి: దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక మెయిన్ రోడ్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు పోరాటాలు చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. బ్రిటీష్ కాలంలోనే కార్మికులు పోరాటాలు చేసి 25 కార్మిక చట్టాలు సాధించుకుంటే నేడు బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా చట్టాల్ని మార్చి కార్మికులను బానిసలుగా చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. అంగనవాడీ వర్కర్స్‌కు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేడు హామీలు నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. అనేక సమస్యలు పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. ఈ సమ్మెలో మండల పరిధిలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు మే 20న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లి క్రాస్ రోడ్ వద్దకు చేరుకోవాల్సిందిగా ఆయన కోరారు.

లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న చందోలు

సత్తెనపల్లి: లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ నియమితులయ్యారు. పట్టణంలోని త్యాగరాజ మందిరంలో గురువారం జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ ఆయనను నియమించి పార్టీ కండువా కప్పి జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అగ్రవర్ణాల్లో పేదలను కలుపుకుంటూ రాజ్యాధికారమే ధ్యేయంగా పార్టీ అధినేత, ప్రస్తుత కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణలు పాటు పడుతున్నారన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ పల్నాడు జిల్లాలో బహుజనుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇంతియాజ్‌లకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన మహంకాళి వెంకట్రావ్ పార్టీలో చేరారు. పలువురు నాయకులు, న్యాయవాదులు వారిని అభినందించారు.

వ్యాధి నిర్ధారణ అయితే సరైన వైద్యం పొందవచ్చు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక దంపతులు

సత్తెనపల్లి: వ్యాధి నిర్ధారణ అయితే దానికి తగ్గ వైద్యం పొందవచ్చునని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో జీబీఆర్ హాస్పిటల్, నరసరావుపేట వైద్య బృందంచే పట్టణంలోని 31, 1 వార్డుల్లో కబ్బయ్య స్వామి రామాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఏదైనా అనారోగ్యం సంభవిస్తే తప్ప వైద్యశాలలకు వెళ్లే పరిస్థితి ఉండడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాసు లింగారెడ్డి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ముందుగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉచిత వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ గోరా, నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, షేక్ జలీల్, చెంచిరెడ్డి, తిరుములరావు, డేవిడ్ వెంకట్రావు, మధు, రఫీ, సాయిబాబారెడ్డి, నిరంజన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి కిషోర్‌ను తొలగించటం అప్రజాస్వామికం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజవరపు శివనాగేశ్వరరావు

సత్తెనపల్లి: మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి వడ్డెర సామాజిక వర్గానికి చెందిన తురకా కిషోర్‌ను తొలగించడం అప్రజాస్వామికం, అన్యాయమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజవరపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 15 సార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేదనే కారణంతో తొలగించామని చెబుతున్నారని, ఆ సమయములో పోలీసుల వేధింపులు, అక్రమ కేసుల వలన జైలులో ఉన్నందున సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని కారణంగా చూపి తొలగించటం అన్యాయమన్నారు. బీసీలు అంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్న చూపేనని, బీసీ అడ్వకేట్స్ హైకోర్ట్ జడ్జిలుగా పనికిరారని, అలాగే నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ అవమానించిన సంగతి తెలిసినదేనన్నారు. అలాగే పల్లెకారులు వర్షాకాలంలో సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు ఆటుపోటుల సమయంలో ప్రమాదవ శాత్తు మరణిస్తున్నారని, వారి న్యాయమైన సమస్యలను తెలుపుటకు చంద్రబాబు నాయుడు వద్దకు వెళితే.. తాట తీస్తా, తోలు తీస్తా అని గతంలో వారిని బెదిరించారని గుర్తు చేసుకున్నారు. అలాగే ఎవరైనా.. దళితులుగా పుట్టాలని కోరుకుంటారా..? అని దళితులను గతంలో అవమానించారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మున్సిపల్ చైర్మన్లు, నగర మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లను అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. దీనికి భవిష్యత్తులో చంద్రబాబు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బెల్లంకొండ: యువత క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని బెల్లంకొండ తహసీల్దార్ అశ్రఫున్నీసా బేగం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 30 టీముల వరకు పోటీలలో పాల్గొంటున్నట్లు బెల్లంకొండ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం తెలిపారు. దాదాపు 20 రోజులపాటు ఈ క్రికెట్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలను అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, జానీ, తమ్మిశెట్టి సత్యనారాయణ, జబ్బార్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు అయ్యేలా చర్యలు చేపట్టాలి

జిల్లా స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరరావు



రాజుపాలెం: ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు అయ్యే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం రాజుపాలెం పునరావాస కేంద్రంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను పరిశీలించి షుగర్, బీపీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని వైద్యశాలకు తీసుకెళ్లి అన్ని రకాల పరీక్షలు చేసి మందులు అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డాక్టర్ రవితేజనాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య,సిబ్బంది ఉన్నారు.

వేసవి యోగా శిక్షణ తరగతులు ప్రారంభం





బెల్లంకొండ: మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో గురువారం వేసవి యోగా శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వైద్యశాలలో గ్రామస్తులు, చిన్నారులతో యోగాసనాలను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాలోని ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. యోగాసనాల ద్వారా విద్యార్థులకు చదువులో చురుకుగా ఉంటారని అన్నారు. వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్లు భుక్యా హనుమంతరావు నాయక్, కోటేశ్వరమ్మ, ఆయుర్వేద సిబ్బంది వెంకటరామయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండల కేంద్రమైన క్రోసూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో గురువారం బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజమ్మ మాట్లాడుతూ బాలలు ఆటలు తప్పనిసరిగా ఆడాలని అన్నారు. ఆటల ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సెల్‌ఫోనులకు దూరం ఉంచి ఆటలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరంలో కుర్చీల ఆట, చెస్ ఆటలు ఆడించారు. బాలబాలికలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు పని భద్రత కల్పించాలి

సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులలో భాగంగా ఉపాధి కార్మికులకు పని భద్రత కల్పించాలని నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని 75తాళ్లూరు, పరస, బుచ్చిపాలెం గ్రామాలలో ఉపాధి హామీ కార్మికుల పని విధానాన్ని పరిశీలించి అనంతరం కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పని భద్రతతో పాటు తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లు, కూలీలు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే కొలతలతో పాటు ఉపాధి హామీ కూలీలకు కూలీరేట్లు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎండలు విపరీతంగా ఉండటంతో సమయపాలన పాటించాలని అధికారులు స్పందించి వారికి భద్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గుడ్‌షెపర్డ్ ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్‌పై అవగాహన



బాలల పార్లమెంట్‌పై అవగాహనలో వలంటీర్లు

75 తాళ్లూరు (పెదకూరపాడు): మండలంలోని 75 తాళ్లూరు సచివాలయంలో వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన స్వచ్ఛంద కార్యకర్తలకు బాలల పార్లమెంటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడ్ షెపర్డ్ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గుడ్ షెపర్డ్ సంస్థ చేస్తున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై వలంటీర్స్‌కి వివరించారు. అదేవిధంగా బాల పార్లమెంటు ఆవశ్యకత గురించి వివరించారు. సంస్థ సుపీరియర్ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత చెడు మార్గంలో నడుస్తున్నారని వారిని మంచి మార్గంలో నడిపించి బంగారు భవిష్యత్తు అందించవలసిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను పెంచే విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. సంస్థ ప్రతినిధి బత్తుల బాబు మాట్లాడుతూ బాలల పార్లమెంటు గ్రామాల్లో ఏ విధంగా ఏర్పాటు చేస్తాం, ఎంత మంది మంత్రులు ఉంటారు, ప్రధానమంత్రి బాధ్యతలు, మంత్రుల బాధ్యతలపై వివరించారు. బాలల పార్లమెంటు ముందుకు సాగాలంటే వలంటీర్లు ముఖ్యపాత్ర వహించాలన్నారు. ప్రస్తుతం బాలల పార్లమెంటును అన్ని గ్రామాల్లో గుడ్ షెపర్డ్ సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. సచివాలయం మహిళా పోలీస్ శిల్ప, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్స్ ద్వారా విస్తృత తనిఖీలు



డ్రోన్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

అచ్చంపేట: నవోదయం 2.0 నాటుసారా నిర్మూలనలో భాగంగా మండలంలోని గిరిజన తండాలైన సంద్రతండా, బంగారు తండాలు, సమీపంలోని అడవులలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు గురువారం డ్రోన్స్ ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి మాట్లాడుతూ గిరిజన తండాలు, సమీపంలోని అడవులలో నాటుసారా కాస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. వాటిని నిర్మూలించే దిశగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. డ్రోన్స్ ద్వారా నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పీడీ యాక్టులు, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నాటు సారా, గంజాయి, డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరమన్నారు. కాపుసారా బట్టీలు నిర్వహించే వారిపై పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు పాల్పడి బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను వినియోగించుకుని సన్మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డ్ కమిటీ నియమిస్తూ జీవో

నరసరావుపేట రూరల్: నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కాసా ఆంజనేయులుతో పాటు 14 మందిని నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరితో పాటు లింగంగుంట్ల సొసైటి ఇన్‌చార్జ్, వ్యవసాయ ఏడీఏ, మున్సిపాలిటి ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో కొలువైయున్న షిర్డీసాయినాధుని మందిర పదమూడో వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబాకు విశేషంగా అలంకరించి పూజలు, పంచామృతాభిషేకాలు, గోత్ర నామ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. షిర్డీసాయినాధుని నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లగడపాడు గ్రామంలో కార్డన్ సెర్చ్



లగడపాడు(పెదకూరపాడు): పెదకూరపాడు మండలంలోని లగడపాడు గ్రామంలో సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం భారీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. పత్రాలు లేని 46 బైకులు, తొమ్మిది సంచుల పెద్ద పెద్ద గులక రాళ్లు, ఆరు కత్తులు, మూడు గొడ్డళ్లు, రెండు గడ్డపారలు, స్వాధీన పరుచుకున్నారు. డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతమైన వాతావరణం ఉండాలని, పోలీసు వారికి సహకరించాలని, డ్రగ్స్ రహిత గ్రామంగా లగడపాడు ఉండాలని పిలుపునిచ్చారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే 100కు గానీ దగ్గర్లో ఉన్న స్టేషన్‌కు గానీ తెలపాలన్నారు. సీఐలు పోలూరి శ్రీనివాసరావు, అచ్చయ్య, పి.సురేష్, ఎస్ఐలు గిరిబాబు, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, రవిబాబు, సోమేశ్వరరావు, ప్రవీణ్, వివిధ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.